12005900IM.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేదా కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరండి

ప్రేమ స్వరూపులైన విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

పుడమిని అవతరించిన ప్రతి మానవునకు సత్యమే ప్రత్యక్ష దైవము. ఈ చరాచర ప్రపంచమంతయు సత్యమునుండియే ఆవిర్భవించి సత్యమునందే జీవించి సత్యమునందే లీనమగుచున్నది. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' బ్రహ్మ సత్యమే. అనంతమైనది సత్యము. ఈ బ్రహ్మకు ఆత్మ అని పేరు. నిత్యమైన బ్రహ్మకు సత్య అని పిలుస్తూ వచ్చారు వేదాంతులు. కనుక ప్రతి మానవుడు కూడను గౌరవించవలసినది సత్యమును మాత్రమే. భారతీయులు సత్యవ్రతులు ధర్మ పరాయణులు.. జ్ఞానమే భారతీయుల యొక్క ఆటుపట్టు. ప్రతి మానవుడు కూడ సత్య ధర్మములకు వారసుడే. సహృదయులు, శాంతికాములు అయిన యువతీ యువకులు సత్యాన్వేషణకై సత్యాచరణకై తగిన కృషి చెయ్యాలి.

లోకహితమే భారతీయులయొక్క అభిమతము. అది యువతీ యువకుల యొక్క వ్రతము. అదియే మనమతము. ఇట్టి పవిత్రమైన సత్యమును, సంస్కృతిని యీనాడు విస్మరించటము చేతనే జాతి సమైక్యత, దేశ సమైక్యతను మనము సాధించలేక పోతున్నాము. సత్యము, ధర్మము దేనికిని లొంగదు. భుజబలము, బుద్ధిబలము, అధికారబలము, ఆయుధబలము కూడను సత్యధర్మములకే లొంగవలసినవి గాని సత్యధర్మములు దేనికి లొంగునవి కావు, విజయము ఎల్లప్పుడును సత్యధర్మములనే వరిస్తూ వుంటుంది.

మానవ జీవితములో ప్రధానముగా వుండవలసినది మానవత. ఎన్నివిద్యలు నేర్చినా, ఎంతటి అధికారములు ఏలినా మానవతను మనము మరవకూడదు. భారతీయ సంస్కృతి అనుపమానమైనది. అత్యద్భుతమైనది. అట్టి దివ్యమైన భవ్యమైన భారతీయ సంస్కృతిని యీనాడు విద్యార్థులు విస్మరించి యీ ఆధునిక యుగమునందు, యీ ఆధునిక సంస్కృతికి కేవలము ఆలవాలమై తనయొక్క దివ్యత్వమును తాము విస్మరిస్తూ వస్తున్నారు. ఈనాడు అతివేగముగా అభివృద్ధి గాంచుచున్న సాంకేతిక విజ్ఞాన శాస్త్రము, పారిశ్రామికము అనే పెనుగాలి సమాజమునందు

అనేక రకములైన మార్పులను కలిగిస్తూ వచ్చింది. ఇది మానవ సమాజములో మానవునికి వుండవలసిన నైతిక విలువలు నిలువునా కూలద్రోసినది. నిజముగా వైజ్ఞానికముగా లౌకికముగా భౌతికముగా అభివృద్ధి గావింప చేసినది సత్యమే. కాని పారలౌకికము నిస్వార్ధము దివ్యత్వము, ఆత్మ తత్వమును ప్రయోజనము లేకుండా చేస్తున్నది. ఇది కేవలము ఒకవిధమైన మానవత్వమునే కూలద్రోస్తూ వచ్చినది. కనుకనే యీనాటి యువతీ యువకులు తమయొక్క తత్వాన్ని తమ యొక్క దివ్యత్వాన్ని తాము గుర్తించలేక పోతున్నారు. స్వార్థము, స్వప్రయోజనమే వారి జీవిత లక్ష్యముంగా భావిస్తూ వస్తున్నారు. దీనికి తగినట్లుగా ఆడంబరాలు, వాచాలత్వము, అహంకారము యిత్యాది పైశాచిక ప్రవృత్తులు ప్రళయ తాండవము సల్పుతూ వస్తున్నాయి సమాజమునందు. ఆధ్యాత్మికమున గురుపీఠము అని పేరుగాంచిన భారతదేశమందు యీనాడు అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములనే పెను భూతములు స్వేచ్ఛా విహారము సల్పుతున్నవి. ఆధునిక సంస్కృతికి బానిసలై కేవలము పవిత్రమైన భారతీయ సంస్కృతిని యే మాత్రము చింతించక సత్యధర్మ ములను పాటించక తనయొక్క లౌకిక జీవితమునే లక్ష్యము నందుంచుకొని ప్రవర్తిస్తున్నాడు.

ఈనాడు విద్యార్థులు రక్షించవలసినది దేశమును కాదు. సత్యధర్మములు మాత్రమే రక్షించాలి. సత్యధర్మములే దేశమును రక్షిస్తాయి. కేవలము సత్యధర్మములను విస్మరించి దేశరక్షణ దేశరక్షణ అని దేశమును భక్షిస్తున్నారు యీనాటి విద్యావంతులు. విద్యలు నేర్చినంత మాత్రమున వివేకులు కారు. జీవనోపాధి నిమిత్తమై విద్యను అభ్యసిస్తున్నారేగాని జీవిత పరమావధి అనే సత్యాన్ని విస్మరిస్తున్నారు. జీవిత పరమావధిని కూడను లక్ష్యము నందుంచుకోవాలి.

గొప్ప చదువులుండి గుణము లేకున్నను
విలువ యేమి వాని ఫలమదేమి
పంటపండని భూమి పది ఎకరము లేల
కొంచెమైన చాలు మంచి భూమి.

గొప్ప విద్వాంసుడగుటకంటె గుణవంతుడు కావటము అత్యవసరము. ఈనాడు కలిమి, చెలిమి బలమును చేకూర్చుకొనుటకు తగినకృషి చేస్తున్నారేగాని గుణమును పోషించుటకు ఎవ్వరూ ప్రయత్నము గావించటము లేదు. కలిమి, చెలిమి, బలములు కదలిపోయే మేఘములు. శాశ్వతముగా సత్యమార్గమును నిరూపించునది గుణము. గుణమునందు ఆదర్శవంతులు కావాలిగాని బలము నందు గాని ధనము నందుగాని ఆదర్శవంతులు కారాదు.

లోకహితైషులు, శ్రేయోభిలాషులు అనేకమంది పెద్దలు యీ ఆధునిక సంస్కృతికి

120059003H

తామలో బడి ప్రాచీన పరిస్థితిని విస్మరిస్తూ వస్తున్నారు. ఆవు పంటలో పడి మేస్తుంటే దూడ గట్టుపైన వుంటుందా? ఇది అసాధ్యము. పెద్దలే యీ పెడమార్గము పట్టినప్పుడు యింక యువతీ యువకులు చెప్పనక్కర లేదు. నాయకులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు సరియైన ఆదర్శమును నిరూపించటము లేదు. మన పూర్వీకులు నైతిక విలువలో గొప్ప ప్రఖ్యాతి గాంచటానికి కారణము ఏమిటి? వారి ధర్మిక వృత్తియే. చతుర్విధ పురుషార్థములను చక్కగా విశ్వసించి ఆచరించి ఆనందించి ఆ ఆనందమును పదిమందికి పంచుతూ వచ్చారు పూర్వీకులు. కానీ యీనాటి యువతీ యువకుల యందు తలతోక లేని ధర్మాన్ని అనుసరిస్తూ వస్తున్నారు. ధర్మార్థ కామ మోక్షములు చతుర్విధ పురుషార్థములు. ధర్మమనే పాదమును, మోక్షమనే శిరస్సును విశ్వసించక కేవలము అర్థ కామములను మాత్రమే పట్టుకొని వారు జీవిస్తున్నారు. కనుకనే సమాజమునందు, దేశమునందు అశాంతి, అభద్రత పెరిగిపోతూ వచ్చింది. శాంతి భద్రతలు కోల్పోటానికి మూలకారణము ఏమిటి? శాంతి భద్రతలు కోల్పోవటానికి మూలకారణము సత్యధర్మములు విస్మరించటమే. మానవుని యందు ఆవిర్భవించ వలసినవి సత్యధర్మములే.

విద్యార్థులారా! మన ప్రాచీన సంస్కృతిని మనము విస్మరించరాదు. అదియే భారతీయుని యొక్క ప్రాణము. ప్రాచీన కాలమునుండి దేశమునకే కాక అనేక దేశములకు ఆదర్శము నందించిన సూత్రములు భారతీయుల యొక్క రత్నములు. కేవలము అనుకరణ అనే బలహీనతను యీ ఆధునిక యుగమునందు అభివృద్ధి గావించటం చేతనే దేశము యిలాంటి పరిస్థితికి దిగజారిపోతూ వచ్చింది. Imitation is human. Creation is Divine. మన యొక్క దివ్యత్వమును మనము ఆవిర్భవింప చేసుకోటానికి విద్యార్థులు తగిన కృషి చేయుటమే సరియైన విద్య. గడచిన యాభై సంవత్సరములకు పూర్వము యువతీ యువకులు దేశాభిమానమును కలిగి సంస్కృతి అభిమానము చేత వారి జీవిత జాడలను సరియైన మార్గములో అనుసరిస్తూ వచ్చారు. ఆనాటి దేశనాయకులు, గురువులు, పండితులు, ఆదర్శ పురుషులుగా రూపొందుతూ వచ్చారు. వారి మాట ఆచరణ ఏకము గావిస్తూ వచ్చారు. త్రికరణ శుద్ధితో కార్యమును ఆచరిస్తూ వచ్చారు. అందువలనే యువతీ యువకులు వారిని అనుసరిస్తూ వారి అడుగు జాడలలో నడుస్తూ వచ్చారు. ఆనాటి యువతీ యువకుల గదులయందు ఆదర్శవంతమైన నాయకుల యొక్క చిత్రములు పవిత్రమైన అవతార తత్త్వమును చక్కగా వారు ఆరాధిస్తూ దానివల్ల ఆదర్శవంతమైన జీవితము అనుభవిస్తూ వచ్చారు. ఈనాడు ఆదర్శవంతమైన గురువులుగాని ఆదర్శవంతమైన నాయకులు గాని కనుపించటం లేదు. వారు చెప్పునది ఒకటి చేయునది మరొకటి. అందువలననే యువతీయువకుల యొక్క విశ్వాసము క్రమక్రమేణా దిగజారుతూవచ్చింది.

ఈనాడు యువతీ యువకుల యొక్క గదుల యందు తమ ఆరాధనా దేవతలు కేవలము ఒక సినిమా లీడర్సుగా తీసుకుంటూ వచ్చారు. ఈ విధముగా యువతీ యువకుల యొక్క బుద్ధులు దిగజారి పోవటానికి కారణము యేమిటి? కేవలము భారతీయ సంస్కృతి యందు సరియైన విశ్వాసము కలిగి, సరియైన ప్రబోధలు చేసే నాయకులు లేక పోవటమే కారణము. భారతీయ సంస్కృతి వేష భాషల యందే కాక ఆచారవిచారములందే కాక అడుగడునా తెల్లవారి మొదలు రాత్రి వరకు కూడను మనకు కనుపించే దంతయు భారతీయ సంస్కృతియే. ఈ యొక్క సంస్కృతియే లేకుండిన మానవ జీవితమే లేదు. It is a way of life. ఈ విధమైన మార్గమునే మనము ధిక్కరించి పెడమార్గమును అనుసరించుచు శాంతి భద్రతలకు దూరమై పోతున్నాము.

ప్రతి వ్యక్తి కూడను సుఖము, సుఖము, సుఖ మనే దానిని ఆశిస్తూ వస్తున్నారు. ఈ సుఖము అంటే యేమిటో గుర్తించుకోటానికి ప్రయత్నించటము లేదు. దినమునకు నాలుగు పర్యాయములు భుజించటము, చక్కగా నిద్రించటము, మూడు పర్యాయములో లేక నాలుగు పర్యాయములో టెలివిజన్, సినిమాయో చూడటము ప్రపంచమునే మరచి వుండటము సుఖముగా భావిస్తున్నారు. తినటము, త్రాగటము, ప్రపంచమును మరచటము దీనికి మానవునిగా పుట్టవలసి వచ్చిందా? పశుపక్షి మృగాదులు కూడను తినటం లేదా, నిద్రించటం లేదా, ప్రపంచమును మర్చటం లేదా యింత మాత్రమునకే మానవునిగా జన్మించటానికి అవసరము యేమి వచ్చింది. 'జంతూనాం నర జన్మ దుర్లభమ్'. ఇట్టి ఉత్తమమైన మానవత్వమును యీనాడు మనము మరచిపోతున్నాము. కనకనే మన యొక్క సంస్కృతి యేమిటో వారు గుర్తించటానికి ఏ మాత్రము ప్రయత్నించలేక పోతున్నారు. భారతీయ సంస్కృతి యందు కేవలము జీవనోపాధి మాత్రమే కాక జీవిత పరమావధి తత్వాన్ని చక్కగా వర్ణించి, వివరించి, బోధించిన దివ్యమైన భావములు.

సంస్కరింప బడినదే సంస్కృతి. ఈ సంస్కృతి సంస్కృతమునుండి కూడను ఆవిర్భవించినటు వంటిది. ప్రపంచమునందు సహజముగా ఆవిర్భవించిన ప్రతి పదార్థము కూడను సంస్కరించి అనుభవించునటు వంటిదే సంస్కృతి. చిన్న ఉదాహరణము. మనము నిత్యము బియ్యమును భుజిస్తున్నాము. ఐతే యీ భుజించటానికి, యీ స్థాయికి రావటానికి పూర్వము ఎన్నివిధములైన సంస్కారములు పొందింది. గడ్డిలో వున్న వడ్లను వేరు చేయటము, ఆ వడ్లపైనున్న పొట్టును విడదీయటము, విడదీయ బడిన బియ్యమును వుడకబెట్టటము అపరిపక్వమైన పదార్థము మనము భుజించటము. ఇన్ని రకములైన సంస్కారములు జరగటం చేతనే మనము భుజించుటకు వీలవుతున్నది యీ బియ్యము. సంస్కారము చేత తమవిలువలు కూడను పెంచుకొంటు

న్నాము. ఒక మూట వడ్లు వుంటుంటే ఒక నూరు రూపాయలు మాత్రమే యివ్వగలము. దానిని సంస్కరింప చేసి దాని పొట్టును వేరు చేసి సరియైన దృష్టికి అనుభవించగలిగే యోగ్యతను తెప్పించటము చేతనే ఒక్క మూట ఆరునూరు రూపాయలుగా పెరుగుతున్నది. ఒక్క మూట నూరు రూపాయలుగా వుండిన వడ్లు ఒక్క మూట బియ్యముగా మారినప్పుడు ఆరు వందల రూపాయలుగా పెరగటానికి యేమి కారణము. ఈ వడ్లు సంస్కరించిన ఫలితమే. దీనికి విలువ. మన చేతియందు ఒక గడియారము కట్టుకుంటాం. ఈ గడియారము విప్పుల్ వేస్తే రెండు తోలు stainless steel చెక్కలు. కానీ గడియారమునకు వేయి రూపాయలు యిచ్చి నేను పొందటానికి యేమి కారణము సంస్కారమే దీనికి కారణము. దీనిని సరియైన స్థితిలో మనము అనుభవించే యోగ్యతగా తీర్చిదిద్దారు. bolts, nuts, శీలలు అన్నీ సక్రమముగా సవరించటం చేతనే యిది సంస్కారముగా మారింది. ఇదే విలువ పెరగటము. ఇదే విధముగనే భారతీయులు ప్రాచీన కాలము నుండి ప్రతి పదార్థము కూడను సంస్కరింప జేసి అనుభవిస్తూ వచ్చారు. ఇది ఒక వస్త్రము. ఐతే యిది వస్త్రముగా మారటానికి ఎన్ని రకములైన సంస్కారములు పొందింది. ప్రత్తిగా వుంటుంది నూలుగా మారి యీ నూలు నేయటం చేత యిది ఒక వస్త్రముగా తీర్చిదిద్దాము. ప్రత్తిని ప్రత్తిగానే మనము అనుభవించటము లేదు. ప్రత్తిని అనేక విధములుగా సంస్కరింప చేసి తదుపరియే దానిని ధరిస్తూ వస్తున్నాము. అదే విధముగనే మానవుడుగా పుట్టి మానవుడుగానే జీవించటము వ్యర్థము. మానవాతీతమైన దివ్యత్వముగా మనము తీర్చిదిద్దుకోవాలి. ఇలాంటి సంస్కారమునకు తగిన కృషి మనము చెయ్యాలి.

కనుక విద్యార్థులు యీనాడు విద్యతో బాటు వినయము, వినయముతో బాటు వివేకము వివేకముతో బాటు విచక్షణ యీరకమైన సంస్కారముల చేత మానవత్వము పరిపూర్ణత్వమును పొందటానికి వీలవుతుంది. మానవుడు పరిపూర్ణుడు కావాలనుకుంటె చిన్న ఉదాహరణము ఒక విత్తనము మనము భూమిలో నాటుతున్నాము. నాటిన విత్తనము చిన్నగా రెండు ఆకులతో మొక్క బయలుదేరుతుంది. ఇది క్రమక్రమేణా కొమ్మలతో రెమ్మలతో పాటు రూపొందుతుంది. తదుపరి ఆ వృక్షము ఫలములు మనకు అందిస్తుంది. ఇదే విత్తనము యొక్క పరిపూర్ణత్వము. కాబట్టి మానవత్వమనేది కేవలము ఒక విత్తనము వంటిది. దానిని అనేక రకములుగా మనము సంస్కరించినప్పుడు అదే ఒక విశాలమైన ప్రేమ తత్వముగా కొమ్మలు రెమ్మలుగా రూపొందుతుంది. తదుపరియే యిది శాంతి భద్రతలనే ఫలాన్ని కూడను యీ వృక్షము అందిస్తుంది. అదియే మానవుని యొక్క పరిపూర్ణత. ప్రేమ ప్రేమ అనబడే దైవ గుణమును మానవుని వరకు మాత్ర

ము పరిమితి గావించరాదు. ఈ ప్రేమను పశుపక్ష్యమృగాదులకు కూడను ప్రసరింపచేయాలి. ఇలాంటి విశాలత్వమె పెంచుకోటమే మన సంస్కృతి.

ఈ సంకుచిత భావాన్ని విస్మరించి, విశాల భావాన్ని అభివృద్ధి పరచి తనకు తాను అనుభవించి పది మందికి పంచినప్పుడే యీ మానవత్వము దివ్యత్వముగా మారగలదు. భారతీయ సంస్కృతి యందు వివరింప చేసిన వేదములు 'అద్వేష్టా సర్వ భూతానాం' ఎవరిని కూడా మనము ద్వేషించరాదు. అనే పవిత్ర బోధను గావించటములో అంతర్యాము యేమిటి? కనుక మనము యీ చదువులో బాటు భారతీయ సంస్కృతి గుర్తించటానికి, ఆచరించటానికి తగిన కృషి చేయాలి. ఈనాటి మానవత్వములో జగత్తు యే విధముగా రూపొందినది మీకే తెలుసు. మానవుడు వేసే ప్రతి అడుగు కూడను ధర్మము తప్పుతున్నది. ప్రతి పలుకులో కూడను సత్యము సడలి పోతున్నది. ప్రతి ఆలోచన యందు దూరదృష్టి నశించి పోతున్నది. ప్రతి దృష్టి యందు ప్రేమ తరిగి పోతున్నది. అభ్యుదయ భావాలు అడుగంటి పోతున్నాయి. ఆధ్యాత్మికము హాస్యాస్పదము అయిపోతున్నది. కేవలము కులమత ద్వేషములు పెరిగి పోతున్నాయి. ప్రాంతీయ దురభిమానములు, స్వార్థ స్వప్రయోజనములు వెర్రి తలలు వేసి పెరిగి పోతున్నది. మానవుని యందు చైతన్యము చల్లబడి పోతున్నది. ప్రతి సంకల్పము కూడను స్వార్థముగా రూపొందుతున్నది. దీనికి అంతా కారణము ఏమిటి? కారణమును మనము విచారించటము లేదు. ఈ దృశ్యకల్పితములైన వివేకములు అవివేకములను మాత్రమే మనము గుర్తించటానికి ప్రయత్నిస్తున్నాము.

పాప భీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దాని బట్టి
మానవత్వ మణగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు.

ఈ నాడు విశ్వమునకు విప్లవము సంభవిస్తున్నదంటే కారణము యేమిటి? పాప భీతి, దైవప్రీతి, సంఘనీతిని కోల్పోయినాము. కేవలము మానవుడు మానవుడని ఆకారమానవత్వముతోనే మనము జీవిస్తున్నాము. ఇట్టి ఆకార మానవత్వము వల్ల లోకమునకు యేమాత్రము మంచి చేయలేరు. ఆచార విచార మానవునిగా రూపొందాలి. ఆచారవిచారము లేక ఆకారమానవుని వల్ల వచ్చే ప్రమాదమే యీనాటి పరిస్థితి.

విద్యార్థులారా! మీరు చదువుతో బాటు దేశము యొక్క విశ్వాసము దేశకళ్యాణము ను దృష్టి యందు వుంచుకోవాలి. ప్రాచీన కాలము నుండి హైందవ సాంప్రదాయము 'లోకా

'సమస్తా సుఖినో భవంతు' అందరు సుఖముగా వుండాలనేదే భారతీయుల సాంప్రదాయము.
ఆధ్యాత్మిక సంపత్తి వల్ల అన్ని దేశములకు సుస్థిరమైన శాంతి భద్రతలు చేకూరుతూ వచ్చింది.
భారతదేశము. భారతీయులకు ప్రధాన గ్రంథము వేదము. ఈ వేదము బోధించినది మొట్ట
మొదట సత్యం వద ధర్మం చర. సత్యమును వుచ్ఛరించు. ధర్మమును ఆచరించు. దురదృష్ట
వశాత్తు సత్యమును వుచ్ఛరించటమే లేదు. ధర్మమును వుచ్ఛరిస్తున్నారే గాని ఆచరించటము
లేదు. ధర్మమును ఆచరించాలి. ధర్మో రక్షతి రక్షితః. ధర్మమే మనలను రక్షించేది. ఈ ధర్మ
మంటే ఏమిటి? కేవలము మన ఆచారములు సాంప్రదాయములు యివి మాత్రమే కాదు. మన
స్సేకం, వచస్సేకం, కర్మణ్యేకం ఇదే మానవుని యొక్క ధర్మము. The proper study of
mankind is man. ఈ మూడింటిని యేకత్వము గావించాలి. అప్పుడే త్రికరణ శుద్ధి
యేర్పడుతుంది. ఆ త్రికరణ శుద్ధియే మన ధర్మము. ఈనాడు మాటలయందు వేరు, తలంపుల
యందు వేరు క్రియలు మరొకటిగా మారుతూ రావటం చేతనే ధర్మము క్షీణించి పోయింది.
కనుకనే వేద ధర్మము సత్యంవద ధర్మంచర. ఉపనిషత్తులు చెప్పాయి. ఎలాంటి పరిస్థితుల
యందైనా నీవు సత్యాన్ని వదలవద్దు. ధర్మాన్ని వదలిపెట్టవద్దు. ఎలాంటి పరిస్థితులయందు
ప్రాణాపాయము సంభవించినప్పుడు గాని ధర్మము మాత్రము మానరాదు. అదియే సత్యహరి
శ్చంద్రుడు సాధించిన వ్రతము. ఇలాంటి పవిత్రమైనవి ఉపనిషత్తులు మానవులకు పలుమారు
లు బోధిస్తున్నాయి. సత్యమునకే విజయము అని. ఇలాంటి విజయమును సాధించవలసిన
వాడు ధర్మాన్ని అనుసరించాలి. ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నిస్తున్నాడు. సంజయా! పాండ
వులు కౌరవులు యిద్దరు యుద్ధభూమిలో చేరారు. వారు ఏమి చేస్తున్నారు? యుద్ధమునకు
పోయినవారు యుద్ధము చేస్తారు గాని డిన్నరు అనుభవిస్తూ వుంటారా. మహారాజా యుద్ధ
ము సంభవించింది. యుద్ధము చేస్తున్నారు. అని చెప్పాడు. 'నీవుద్దేశ్యము విజయము ఎవ
రికి సంభవిస్తుంది?' అని ప్రశ్నించాడు రెండవ ప్రశ్న. సంజయుడనగా యింద్రియనిగ్రహము
కలిగినవాడని అర్థము.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః.
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.

ఓ మహారాజా! ఎక్కడ సర్వశక్తిమయుడైన భగవంతుడు, ఎక్కడ సర్వధర్మ పరాయణుడైన
అర్జునుడు నిర్మలుడై వుంటుండునో అక్కడనే విజయము. ఈ విజయమునకు సత్యధర్మ
స్వరూపులైన భగవంతుని అనుగ్రహమే ప్రధానమని బోధించాడు. ఇంక పురాణములు ఏమి

చెబుతూ వచ్చాయి. పురాణములు కూడను యీసత్య ధర్మములనే ప్రబోధిస్తూ వచ్చాయి. సత్యం నాస్తి పరో ధర్మః. ధర్మమనేది సత్యముపైన ఆధారపడి వుంటున్నాది. దీనికంటె మించినది లేదు ఇంక భాగవతము అనేక విధములుగా బోధిస్తూ పలికి బొంకుటకన్న పాపమున్నె మనము చెప్పి దానిని తప్పి పోవుటకంటె పాపము వున్నదా. అనగా సత్యమే ప్రధానమని నిరూపిస్తూ వచ్చింది. కనుక సత్యమే యీ జగత్తును కాపాడుతూ వున్నది. ధర్మమే యీసత్యమును ఆశ్రయించి నటువంటిది. సత్య ధర్మములు రెండు కూడను అవినాభావ సంబంధము అన్యోన్యాశ్రయములు.

భారత పుత్రులైన యువతీ యువకులారా! ప్రధానమైనది సత్య మార్గము. దానినే దైవ స్వరూపముగా విశ్వసించాలి గౌరవించాలి.

చదువులన్నియు చదివి చాల వివేకియై
మగిడి తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతినున్నను
హీను డవగుణంబు మానలేడు.
తరచి చదువు చదవ తర్కవాదమెగాని
పూర్ణ జ్ఞానమెపుడు పొందలేరు
చదువు చదివి చదివి చావంగ నేటికి
చావులేని చదువు చదవవలయు.

అదియ్యే సత్య చదువు. అదియే ధర్మ చదువు. ఆ ధర్మము సత్యము సత్పురుషుల చెంత వుంటుంది. ఎవరు సత్యాన్వేషణ సలుపుతూ వుంటారో ఎవరు సత్యవ్రతులుగా వుంటారో ఎవరియందు సద్గుణములు ప్రకాశిస్తూ వుంటాయో వారి సన్నిధియందే వుంటుంటాది సత్యము. కనుకనే ఆత్మకు సత్య అని మరొక పేరు. ఈ ఆత్మ నిత్యమైనది కనుకనే ఆత్మను సత్య అనిపిలుస్తూ వచ్చారు. సర్వులయందు వుండినది అది ఒక్కటే. ఇంక అన్నీ కూడను మార్పు చెందునవే. వ్యక్తిగాని విషయముగాని, పదార్థముగాని కదలిపోయే మేఘములే. అట్లని భౌతిక చదువులు చదవవద్దని కాదు. ఈ చదువులతో ఆ చదువులు కూడను చదవటానికి తగిన కృషి చేయాలి. ఎంతమంది ఎన్ని చదువులు చదవలేదు. ఎంతటి పేరు ప్రఖ్యాతులు పొందలేదు. కాని అవి అన్నెంతకాలము. అవి అన్నీ క్షణభంగురమైనవి. దేహమే అస్థిరమైనది. ఈ దేహము నశించినా కూడను మన సంస్కారములు చిరంజీవిగా వుంటాయి.

విద్యార్థులారా! ఆదర్శము కోసము మనము జీవించాలి గాని అన్నము కోసము

కాదని గుర్తించాలి. ఆదర్శము శాశ్వతమైనది. ఇట్టి పవిత్రమైన ఆదర్శము చేత యింత్తైనను మున్నందు అభివృద్ధి కాగలరు. కాని వయసు కలకాలము తిరగక హంసపై క్షణము ఆడుమురా. మనము ఆదర్శవంతమైన విద్యార్థులుగా ఒక పది సంవత్సరములు బ్రతికినా చాలు. కనుక మనము ఆదర్శవంతమైన జీవితము అనుభవించుటానికి దేశాభిమానము, ఆత్మాభిమానము అత్యవసరము. పుట్టిన ప్రతి ఒక వ్యక్తి కూడను మొట్టమొదట గుర్తించేది తల్లిని తండ్రిని. తల్లిని తండ్రిని గుర్తించని వ్యక్తి యీ జగత్తులో వుండడు. దేశాభిమానము, ఆత్మాభిమానము గుర్తించినవాడే నిజముగా తల్లి తండ్రులను గుర్తించినవాడౌతాడు. నాదేశమంటే ఎలాంటిది. ఎంత పవిత్రమైన దేశము. ఎంత దివ్యమైన దేశము. ఎలాంటి ఆదర్శవంతమైన దేశము. ఎంతటి ప్రేమపూరితమైన దేశము. ఎంతటి విశాలమైన దేశము. మన దేశము యొక్క విశిష్టతను గుర్తించాలి మొట్టమొదట విద్యార్థులు. ఏదో భారత దేశము చెత్తభూమిగా మీరు విశ్వసించి విదేశములకు ప్రయాణమై వెడుతున్నారు. భారత దేశములో లేనటువంటిది ఏ దేశములో కూడను లేదు.

భవ్యభావాలు కల్గిన భారతీయ
దివ్యసంస్కృతి తత్త్వంబు తెలుసుకొనగ
భారతీయులు యత్నింప నేరరైరి.
ఇంతకంటెను దౌర్భాగ్యమేమి కలదు

ఇలాంటి కర్మభూమి, యోగ భూమి, త్యాగ భూమి అయిన భారతదేశమునందు పుట్టిన యువకులైన మీరు భారతీయ సంస్కృతినే గుర్తించటానికి ప్రయత్నించలేకపోవటము చేత యీ విధమైన అవస్థలకు గురియైపోతూ వస్తున్నారు. ఇటి విశిష్టమైన సంస్కృతిని గుర్తించాలి. విచారించాలి. దీనిని ప్రబోధించే పెద్దలుగాని, పండితులుగాని, తల్లితండ్రులుగాని లేకపోవటమే దీనికి మూలకారణము.

విద్యార్థి విద్యార్థినీయులారా! యీ పదహైదు దినములు కూడను పవిత్రమైన సంస్కృతిని ఆధునిక జీవితాన్ని రెండింటిని సమన్వయ పరచి సత్యమార్గమును విడువక, ధర్మమార్గమును విసర్జించక, న్యాయమార్గము లోపల మన జీవితాన్ని గడపటానికి కృషి చేయాలి. మనకు అధికారము ప్రధానము కాదు. అధికారములు కేవలము కదలిపోయే మేఘములు. దానిని మిత్తమై గర్వించనక్కరలేదు.

మా కురు ధన జన యౌవన గర్వం
హరతి నిమేషాత్కాలం సర్వమ్.

మనిషిలో క్షణములో వచ్చి క్షణములో పోయేదే యీ యవ్వనము. మధ్యలో వచ్చి మధ్యలో పోయేదే యీ యవ్వనము. ఇలాంటి క్షణభంగురమైన, యిలాంటి మధ్యకాలములో వచ్చే యవ్వనమును ఆధారము చేసుకొని భ్రష్టు పట్టి పోరాదు. ఇది చాలా ఉత్తమమైన జీవితము. ఇది పవిత్రమైన కాలము. ఈ కాలమును మనము వ్యర్థము చేసుకోరాదు. వ్యర్థమైన కాలము తిరిగి మనము సార్థకము చేసుకోటానికి ప్రయత్నించినప్పటికి యేమి ప్రయోజనము లేదు.

విద్యార్థులారా! సంస్కృతి విశ్వాసాన్ని అభివృద్ధి పరచుకోండి. ధర్మమనేది ఒక దేశమునకు ఒక కాలమునకు పరిమితమైనది కాదు. దేశ కాల పరిస్థితుల ప్రభావమునకు అతీతమైనది భారతీయ సంస్కృతి. దానిని గురించి యీ పదహైదు దినముల లోపల చక్కగా దీని పరిపూర్ణ స్వరూపాన్ని గుర్తించటానికి ప్రయత్నించవచ్చు. మన Vice-Chancellor షరాఫ్ ప్రారంభములో అందరిని స్వాగతించే సమయములో శరీరమును, యింద్రియములను, మనస్సు, ఆత్మ యీ ఐదింటి ప్రభావమును, విశిష్టతను, దాని యొక్క స్వరూపమును వివరించాలని తాను ప్రార్థిస్తూ వచ్చాడు. ఈనాడు నిజముగా విద్యార్థులకు యిది అత్యవసరము. తానెవరో తెలుసుకొనక బయటి ప్రపంచమును తెలుసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. తనను తాను తెలుసుకొనటానికి తగిన ప్రయత్నము చేయాలి. కనుక తన దేహమును, తన మనస్సును, తన యింద్రియములను, ఆత్మ తత్వమును మొట్టమొదట గుర్తించటానికి ప్రయత్నము చేయాలి.

జగత్తున జీవించువాడు మనుజుడు కావలె మొదట
దనుజ దుష్కృతులనెల్ల పొగడుచుండువాడు చవట
బ్రహ్మ జ్ఞానము నేర్పి యిచ్చుట ఆత్మ జ్ఞానము తెలుసుకొనుట
ఇదియే మన జీవితమునకు రాజబాట

ఈ బాటను మొట్టమొదట గుర్తించాలి. ఈ పాఠము మనము నేర్చాలి. ఈ మాటలో మనము అంకితము కావాలి. ఈ పవిత్రమైన, అన్నింటికిని సారమైన వేద వాటును మనము గ్రోలాలి. ఈ పదహైదు దినములు కూడను యీ పవిత్రమైన కాలమును పవిత్రమైన భావము చేత మన హృదయాలు నింపుకొని యీ విద్యార్థినీ విద్యార్థులందరు విశాలభారత దేశమందు దీని యొక్క ప్రచార ప్రబోధములకు తగిన కృషి చెయ్యాలి. అన్నింటి కంటె ముఖ్యము భక్తి. దైవభక్తి అత్యవసరము. దైవభక్తియే లేకుండిన మనము దేనిని సాధించలేము. అనుకుంటాము నేను సాధిస్తున్నాను, నేను సాధిస్తున్నాను, ఇది కేవలము అహంకారము యొక్క వికార స్వరూపమే. కనుక

12005901IM

ఆత్మ విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. ఆత్మ విశ్వాసమును బలపరచుకొన్నప్పుడు యింక అన్నీ మనము సాధించిన వారమవుతాము.